# మంచి కథ!

శ్రీమతి వేదుల మీనాక్షీ దేవి

"ఎవ్వరూ, ఎక్కడా వ్రాయని మంచికథ వ్రాయాలి" అనుకుంది శారదాంబ.

మంచికథ అంటే భక్తిపూరితమైనదని గాని, నీతి బోధకమైన దనిగాని అభిప్రాయం కాదు, దేశకాల పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని యాదార్థ్యానికీ స్వాభావికానికీవిరుద్ధం గాని కథ వ్రాయాలి. నవీనత్వం ఆదర్శం కలిగి ఉండాలి. అలాంటి చక్కని కథను, సర్వజనానురంజకమైనట్లుగా వ్రాయాలనుకుంది ఆమె.

"ముందు కథకి పేరు పెట్టాలి. ఆపేరు వ్రాయదలచుకున్న కథపైన ఆధారపడి వుంటుంది. ఏ సమస్య తీసుకుంటే బాగుంటుంది? ఇదీ ఆమె మొదటి ఆలోచన.

ప్రేయసీప్రియుల కథలు బోలెడున్నాయి. చర్విత చర్వణంగా తోస్తుంది పాఠకలోకానికి. తనూ అలాంటిదే వ్రాస్తే. స్త్రీ విద్య గురించిన కథ వ్రాద్దామంటే ఆ విషయమే పాతబడి పోయింది. నేటి స్త్రీలంతా విద్యావతులే! వ్రాస్తే బాగుండదు. చెప్పదలచిన కథ అంతా చెప్పేసి చివరికి ఏభయంకర ఘట్టంలోనో. ఆనందాతిరేకంలోనో కథకులు కళ్ళు తెఱచిచూసి "కలగదా" అనుకోవడము కూడా పరిపాటైన కథలలోరెక్షే.

బీద కుటుంబాల కథలు గుండెలు కదిల్చేలాంటివి ఎన్నో చాలామంది వ్రాసేవున్నారు. బాగా ఆలోచించగా ఏబాధ లేకుండా, చదువరులకు ఆనందం కలిగించేలాంటి కథ వ్రాయాలి. "ఆదర్శ కుటుంబం" అని కథకు పేరు పెట్టి అందుకు తగినట్లు కథ నడిపితే బాగుంటుందేమోననుకుంది శారదాంబ.

కథనంలోగల వైచిత్రి సహజ సిద్ధమైనకథతో కలిసినప్పుడు రాణిస్తుందనీ, దాన్ని నిరూపించేదే ఉత్తమ కథ అనీ ఆమె సిద్ధాంతం.

గబగబకాగితాలు కలం తెచ్చుకుని బల్లదగ్గరగా కుర్చీ లాక్కుని కూర్చుంది "ఆదర్శ కుటుంబం" అని కథ పేరు పెద్ద అక్షరాలతో వ్రాసింది. అక్కడికి నామకరణ మహోత్సవం అయింది. కలం ఆగింది.

"కథ ఏమిటి? అందులోపాత్రలెవరు? ఎలాంటివారు? కథ ఎలాగ నడపాలి" ఇవీ ఆమె నెదుర్కొన్న విషయాలు. కలంవెనుక భాగాన్ని గడ్డానికి ఆన్చి పైకిచూస్తూ ఆలోచిస్తోంది శారదాంబ.

కథ వ్రాసేటప్పుడు ముందుగా "ఫలానావూళ్ళో" అని కథ ప్రారంభించాలికదా. ఏవూరు పేరు బాగా వుంటుంది?

మెద్రాస్, కలకత్తా, బొంబాయి, ఢిల్లీల వంటి మహా నగరాల పేర్లు పెడితే?

ఇప్పుడవి ప్రజల రాకపోకలతో సర్వసాధారణమైపోయి వాటికి వెనకటి ఘనతపోయింది.

గుంటూరు. కర్నూలు, వాల్తేరు? ఊహు ఇవికూడా పరిపాటే.

పల్లెటూర్ల పేర్లు అసలే నచ్చలేదు. గొప్ప చిక్కే!

ఆమధ్య శారదాంబ ఒకకథలో కాకినాడలో జగన్నాథపురంలోని మొదటివీధిలో చివరయింట్లో ఒకసంఘటన జరిగినట్లు వ్రాసింది. ఆయింట్లో వున్నవారు శారదాంబ యిల్లు కనుక్కొని వచ్చి "మమ్మల్ని గురించి అలావ్రాశారేమిటి"అని దెబ్బలాడి "మరోమాటు యిలాంటి వ్రాతలు వ్రాస్తే జాగ్రత్త యేంచేస్తామో"! అని బెదిరించి చక్కాబోయారు, ఇది జరిగి సుమారు సంవత్సరం కావస్తోంది. అప్పటినుండి యించుమించుగా రచన మానేసిం దావిడ. ఆసంగతి స్ఫురణకు వచ్చింది.

ఎక్కడాలేని పేరు కల్పిస్తే పేచీ వుండదుకదా అని "కమలాపురం"అని పేరు పెట్టిందొక కథలో. కాని ఆ పేరుగల వూరుందని కాలక్రమాన్ని తెలిసింది. ఇదీ గుర్తుకొచ్చింది ఆమెకు.

కాగా ఆలోచించగా ఆఖరికి ఏ చిక్కూలేని పద్ధతిగా "ఒకవూళ్ళో" అంటే తీరి పోతుం దనుకుంది.

అక్కడికి సందేహంతీరింది. కథపేరు తేలింది. వూరి పేరు అవసరం లేదని తేలింది. ఇకఎట్టి ఆక్షేపణా రాదు. మనస్సు తేలికపడిందామెకు.

అక్కడితో కృత్యాద్యవస్థ పూర్తయింది

"ఆదర్శ కుటుంబంలోని భార్యా భర్తల వివాహం ఆదర్శ మైనది. పరస్పరాంగీకారంతో అయింది. అతడు విద్యాధికుడు. ఫుల్‌సూటుమీద వుంటాడెప్పుడూ ... అయినప్పటికీ అతనిలో ఆంధ్రత్వం తొణికిసలాడుతూ వుంటుంది....ఆమె విద్యావతి...వాలుజడ సగంఅల్లి రిబ్బన్ కడుతుంది. గోళ్ళకి రంగు ... లిప్‌స్టిక్ వాడుతుంది. బొట్టు కనబడీ కనబడకుండా పెడుతుంది. .... జార్జెట్ చీరలే కడుతుంది"

శారదాంబకి ఆదర్శకుటుంబంలోని స్త్రీ వర్ణన బాగా లేదు! ఆదర్శ ఆంధ్ర మహిళలాగ లేదు. ఆమె వర్ణన మార్చేసింది.

"కళ్ళకి కాటుక, చిన్నసెనగ బద్దంత తోపుకుంకం బొట్టు. మధ్యపాపిడి. జడవేసినముడి మెడమీదికి వుంటుంది. ఆ జడలో పువ్వులు. గుంటూరు, వెంకటగిరి, ఉప్పాడ చీరలు జరీవి. గుప్పెట్లో యిమిడేవి కడుతుంది. యెప్పుడూ నోటినిండా తాంబూలం వేసుకుని కలకలలాడుతూ వుంటుంది."

ఈమారు ఆ స్త్రీవేషం బాగుంది ఆదర్శగృహిణిలాగ.

వీధిలో యెవరో దెబ్బలాడు కుంటున్నారు కాబోలు రొదగావుంది. శారదాంబగారి పనిమనిషి గొంతుక అన్ని గొంతుకలలోకి యెక్కువగా వినబడుతోంది. ఎక్కడైనా సరే! దెబ్బలాట అవుతోందని తెలిస్తేచాలు. యెంతదూర మైనాసరే వెళ్ళి ప్రముఖపాత్ర వహిస్తుం దక్కడ.

శారదాంబ కథ ఆలోచించడం ప్రారంభించింది. "ఆదర్శ కుటుంబంలోని ఆమె స్వయంగా వంట చేస్తుంది. వంటకు మనిషిని పెట్టదు. అన్నంపెట్టేవాళ్ళు ఆపేక్షకల వాళ్ళుండాలి. కాని, డబ్బుకోసం పనిచేసే వాళ్ళకి ఆపేక్ష అంతఃకరణా యెలావస్తుంది? అలాంటి భోజనం తృప్తి నివ్వదు. ఒక్క వస్తువు చేసుకున్నా యింట్లోవాళ్ళ వంట వల్ల భోజనం తృప్తిగా వుంటుందని ఆమె అభిప్రాయం. ఆమెకు యిష్టమైన దొకటి, భర్తకు యిష్టమైన దొకటి పదార్థాలుచేస్తుంది.

వారిది టేబిల్‌మీల్సు. రంగు దారాలతో తాను కుట్టిన టేబిల్ క్లాత్ వేస్తుంది ఆ బల్లమీద. స్టెయిన్‌లెస్‌స్టీలు పళ్ళాలతో పదార్థాలను బల్లమీద పెడుతుంది. చెలోహాలో మంటూ కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేస్తారు."

పాశ్చాత్య పద్ధతైనా నేటి నవీన పద్ధతులలో టేబిల్ మీల్సు ఒకటికదా అని కథలో ఆవిధం వుంచడానికి మనస్సును సమాధాన పరచుకుంది శారదాంబ.

భర్తకి, పిల్లలకి భోజనం పెట్టి ఆఖరున తనుభోజనం చేసే వేళకి యెవరోవస్తారు. పిల్లలు కొట్టుకుంటారు. చిన్న పిల్లాడు తనుతిని మళ్ళీ కలియబడతాడు విస్తట్లో; "వద్దు" అంటే యేడుస్తాడు; పోనీ అని వూరు కుంటే పడదు. జబ్బుచేస్తుంది. అన్నంఅంతా క్రిందికితోదేస్తాడు; సగంలో మజ్జిగ పొయ్యమంటాడు. లేకపోతే మజ్జిగలో నెయ్యి వెయ్యమంటాడు. "ఎవరూవేసుకోరు అసహ్యంగా వుంటుంది" అంటే మారాం చేస్తాడు.

శారదాంబకి తన భోజనం సంగతి గుర్తుకు వచ్చి నిట్టూర్పు విడిచింది. కథలోనివారి భోజనం పద్ధతి ఆలోచించసాగింది.

"శుద్ధ ఆంధ్రభోజనం. కమ్మని పోపువాసన వేస్తూంటుంది వారివంట. రోజూ సాంబారు. ఒక వేపడం వుండాలి." సాంబారు తమిళ పద్ధతేకాక తమిళ పదార్థం కూడా.అందుచేత పప్పుపులుసు అంటే బాగా వుంటుందనుకుంది శారదాంబ.

"వేపుడు కూరలు ఆమెకు యిష్టం. పప్పు పులుసు గాని మరేదైనాగాని పులుసు అతనికి యిష్టం. యిద్దరికీ యిష్టమైన పదార్థాలు తినాలని వారి అభిమతం"

అమ్మగారూ అంటూ పిలుపు.

తలెత్తి చూసింది. చాకలిమనిషి. నెత్తిమీద బట్టల మూటతోనిలువునా నిలబడింది. లేవకతప్పదు. కాగితాలు బల్లమీద పెట్టి వెళ్ళి బట్ట లప్పగించు కుంది. ఏ విధమైన పరధ్యానంతోవున్నా పాతబట్టలు కొత్తబట్టలలోకి మార్చేసి

అప్పగించే గొడవ వుంది దానిదగ్గర. అందుచేత జాగ్రత్త అవసరం.

బట్టలు అప్పగించుకుని, వాటికైనసొమ్మిచ్చి దాన్ని పంపేసింది. బట్టల్ని దొంతర్లపళంగా పెట్టెలమీదపెట్టింది తరువాత సర్దుకోవచ్చునని. కథ వ్రాయడానికి కూర్చుంది.

కథలో వారి భోజనం పద్ధతి యేర్పాటైంది.

"వారిద్దరూ విద్యావంతులు. పట్టభద్రులు. ఇద్దరూరచయితలు లేకపోతే ఆమె కవయిత్రి అతడు కవిత్వమంటే చెవికోసుకునేవాడు"

ఆరేళ్ళ పిల్లవాడు మడతలు విప్పేస్తున్నాడు. అలా చెయ్యకూడదు. నలిగి పోతాయి బట్టలు అని చెప్పి ఆడుకుందుకు పంపేసింది వాడిని శారదాంబ.

"ఆదర్శ కుటుంబంలోని భర్త భార్యనేమీ అనడు. కోప్పడడు.. ఎక్కడికి వెళ్ళినా యిద్దరూ వెడతారు సాధారణంగా తెలుగు గ్రంథాలు చదువుతూ చర్చిస్తూంటారు.

వారికొక పూలతోట వుంటుంది చక్కని రకరకాల పూల మొక్కలను వారు పెంచుతూంటారు. సాయంత్రం ఆమె మొక్కలకు స్వయంగా నీళ్ళు పోస్తుంది. పాదులు కూడా పెడుతుంది. కాబేజీ, టమాటా, నీటివంగ, ఆనప, మొదలైన కూరలు కాపిస్తుంది. అదొకసరదా ఆమెకు."

ఇకవారి యిల్లు ఏవిధంగా వుండాలి అని ఆలోచిస్తున్న శారదాంబకాలికి బల్లక్రిందవున్న పెట్టెకొన గుచ్చుకుంది. గదినాలుగు పక్కలా చూసిందామె. గోడలనిండా చిలుక కొయ్యలు. కొయ్యలనిండా బట్టలు. టేబిల్ కింద రెండు పెట్టెలు. పక్కనివరుసగా ఒకటి రెండు మూడు నాలుగు పెట్టెలు. ఆ పెట్టెలమీద బట్టల మడతలు. ఓ మూలపుస్తకాల దొంతర. ఒక పట్టెమంచం. పరుపు పరిచి వుంది. దానిమీద వున్న దుప్పటి మీద చిన్న పిల్లవాని పాదాల గుర్తులు మట్టిరంగులో వున్నాయి. ఆ మంచం క్రింద కిటకిటలాడుతూ సామాను ఎప్పుడూ చీపురు వెయ్యడానికి వీలుండదు. నేలమీద కాగితం ముక్కలు, గుడ్డపీలికలు, లక్కపిడతలు. ఆ గదికాక ఒక వంటిల్లూ, వసారా వున్నాయి అద్దెచాలాఅయినా యిల్లుకుశలం. చాలాయిరుకు

శారదాంబకి కథలోకి విషయం దొరికింది.

"ఆదర్శ కుటుంబానికి ఎన్నో విశాలమైన గదులుంటాయి. సామానుగది వేరు. కూరలబుట్టలు గదిలో పెట్టుకోనక్కర్లేదు. పడకగది వేరు. మెత్తని పరుపులతో మంచాలుంటాయి. తెల్లని దుప్పట్లెప్పుడూ వుంటాయి. ఆ దుప్పట్లమీద పిల్లల మట్టికాళ్ళ గుర్తులుండవు. మంచం కింద ఖాళీగా వుంటుంది తుడుచుకుందుకి వీలుగా. తుడిస్తే చిటికెడు ధూళికూడా రాదు ఆయింట్లో. పాలుపోసియెత్తవచ్చు నేలమీద. అంత శుభ్రంగా వుంటుంది.

సావిట్లో నాలుగు ప్రక్కలా బీరువాలు యెత్తయినవి వుంటాయి. వాటినిండా ఆంధ్ర వాఙ్మయానికి సంబంధించిన గ్రంథాలు. సుప్రసిద్ధకవిశేఖరులైన ఆంధ్రరచయితలు చిలకమర్తి, కందుకూరి, పానుగంటివారి గ్రంథాలు. నేటి రచయితలైన కవిసామ్రాట్, మునిమాణిక్యం, జాషువా ప్రభృతుల రచనలు, ఆంధ్ర పురాణంవంటి నవీన ప్రబంధాలు వుంటాయి.

సావిట్లో మధ్యగా టేబిల్ దానిపై ఒక అద్దకం బట్ట పరచి వుంటుంది, ఒక గాజుతొట్టె పూలతో అలంకరించబడి టేబిల్ మధ్యగావుంటుంది. చుట్టూ నాలుగైదుకుర్చీలుంటాయి. యెవరైనా వస్తే కూర్చుందుకు. ఓ వారగా చిన్న మేజామీద రేడియో వుంటుంది"

శారదాంబ కూర్చున్నగది అవతల వసారాలో పిల్లలు అల్లరిచేస్తూ అరుస్తున్నారు. లేచివెళ్ళి తలుపు గడియవేసుకుని వచ్చి కూర్చుంది.

"ఆదర్శ కుటుంబంలోని యజమాని తలుపు తీసుకుని కూర్చుంటే యెవరో ఒకరువస్తూంటారులోపలికి. వద్దంటే బాగుండదు. తలుపు వేసుకుని కూర్చుంటే ఆ వచ్చేవారు తమ పేరు చెబుతారు. పిలుస్తారు, ఇష్టమైతే తియ్యవచ్చు, రమ్మనవచ్చు. లేకపోతేలేదు. అతని అనుమతి లేనిదే లోపలికి రాలేరుగదా!

అందుచేత యజమాని తలుపులు వేసుకుని కూర్చుంటాడు. గడియవేసుకోడు. ఇల్లాలు రాదలిస్తే తలుపుదగ్గర నిలబడి పిలవాలి. ఆ విధంగా ఆమె పిలవడం, తాను తలుపు తియ్యడం ఆదర్శ కుటుంబం పద్ధతికాదు, పైవాళ్ళు రాకుండాను, ఇల్లాలు రాదలిస్తే వచ్చేందుకు వీలుగాను తలుపు దగ్గరగా వేస్తాడు..

వీధిగుమ్మంలో కూరలు బేరమాడు తున్నట్లుంది శారదాంబ డెబ్భైయేళ్ళ అమ్మమ్మ. కొద్దిగా చెముడు. వీధి లోనే కూర్చుని ప్రతీదీ బేరమాడుతూంటుంది.

"ఆదర్శ కుటుంబంలో పిల్లలు అల్లరి చెయ్యరు. పసి పిల్లలుకూడా యేడవరు. మారాంపెట్టరు. మాసిన బట్టలు పెట్టెలలోను, మడతలు మాసినబట్టలబుట్టలోను పడె య్యరు. తడి తువ్వాళ్ళు పరుపులమీదా నేలమీదా బట్టల కొయ్యలమీదా పడెయ్యరు. గాలిలో ఆరవేస్తారు. మట్టిలో ఆడుకోరు; కాగితాలు చింపి పొయ్యరు. వాళ్ళకి అద్దాల బీరువాలు పుస్తకాలకీ బొమ్మలకీ వుంటాయి. బొమ్మల్ని అద్దాలలోంచిచూసి ఆనందిస్తారుగాని యివతలకి తియ్యరు పెన్సిళ్ళు, రబ్బర్లు, పెన్నులు పెటుక్కోరు. అన్నీ బీరు వాలో జాగ్రత్తగా సర్దుకుంటారు.

తల్లి గొంతు చించుకోనక్కర్లేదు. కళ్ళ సంజ్ఞలలో మెలగుతారు. స్కూల్లో టైమ్ టేబిల్ లాగే యింట్లోకూడా టైమ్ టేబిల్ వేస్తుందావిడ. ఆప్రకారం యెవరిపనులు వారు చేసేసు కుంటారు రెండుమాట్లు దైవ ప్రార్థనతో సహా, ఎవ్వరూ చెప్పక్కర్లేదు. ఆ యింట్లో యెవ్వరూ గట్టిగా మాట్లాడరు. ఎంతమంది పిల్లలున్నా ఎవ్వరూ లేనట్లే వుంటుంది నిశ్శబ్దంగా."

ఇంతలో "దుబ్బు" మన్న శబ్దం ఆలోచనలో వున్న శారదాంబకు వినబడింది. ఎవరూ తలుపు తట్టిన శబ్దం కాదు! పట్ట శబ్దంకాదు! ఆమెకు చిరపరిచితమైనదే! వాళ్ళ ఆరేళ్ళశంకరం మూడేళ్ళ తమ్ముడు శ్రీనివాసు వీపుమీద చరచిన దెబ్బ శబ్దం అది!

సన్నని యేడుపు శారదాంబ ఆలోచనలకి అంతరా యం కలిగించింది. లేచి తలుపుతీసింది. శ్రీను యేడుస్తు న్నాడు. తన యేడుపు వినబడితే అమ్మ వస్తుందికదా అని వాడి వూహ. వీపుమీద అయిదువేళ్ళుతట్టుదేరాయి. శార దాంబకు గిర్రున కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. పిల్లవాడిని దగ్గరకు తీసుకుంది. శ్రీను కేసి కొరకొర చూస్తున్న శంకరాన్ని చూసి "యెందుకుకొట్టావురా వాడిని" అని అడిగింది.

"వాడి నేమైనా అంటే కేకలేస్తావుగాని చూడుడబ్బాడు కిరసనాయిలూ యెలాతోడేశాడో" అన్నాడు శంకరం.

డబ్బాచుట్టూ ఒక గజంమేర కిరసనాయిలు చెరువు కట్టింది. ప్రక్కనే వున్న చిన్న తూములోంచి ప్రవహి స్తోంది. ఆ డబ్బా దగ్గిరనుండి గది గుమ్మందాకా శ్రీను చిన్ని పాదాలు కిరసనాయిల్‌తో ముద్రలుగా పడ్డాయి. ఏమనడానికీ పసివాడు. ఏంతెలుస్తుంది?

"ఆదర్శ కుటుంబంలోనివారు వీధిలో కూరలుకొనరు. పనివాళ్ళు బజారునుండి తెస్తారు. అభావం వచ్చి వీధిలో కొనవలసివస్తే శేఖర్ బేరంచేసి కొంటాడు. అది కూడా గప్‌చిప్‌గానే."

ఇలా ఆలోచిస్తున్న శారదాంబకు వాళ్ళ అమ్మమ్మ గొంతు గట్టిగా వినబడింది. ఆమె కూరల బేరం తెమల లేదు, డబ్బులుయివ్వలేదంటున్నాడు కూరలవాడు. ఇచ్చా నంటోంది అమ్మమ్మ. ఇద్దరూ వాదించు కుంటున్నారు. కేకలతో ఆమె గొంతు జీబు పోయింది. మధ్య మధ్య దగ్గుతోంది. పోనీ వెళ్ళి కనుక్కుందామా అంటే అమ్మ మ్మకి కోపం వస్తుంది.

శ్రీనుయింకా యేడుపుమానలేదు. నీ పిల్లిపిల్ల అదుగో చూడు పాపం నువ్వు యేడుస్తున్నావని అదీ యేడుపు మొహం పెట్టి యెలా కూర్చుందో అంది శారదాంబ ధోరణి మార్చే యత్నంలో. ఆమాటలో శ్రీనుకి నవ్వు వచ్చింది. ముఖం నవ్వుతోంది. కళ్ళలో మాత్రం నీళ్ళు న్నాయి.

ఎర్రని పెదిమలు తెల్లని ముఖం నుగ్గునుగ్గుల జుట్టు కళ్ళలో నీళ్ళతో నవ్వుతున్న ఆ పిల్లాడి ముఖం చూసే సరికి శారదాంబకు పెద్దకొడుకు చిన్నప్పటి ముఖం జ్ఞాప కం వచ్చింది. వాడికి వెయ్యి మైళ్ళ దూరంలో ఉద్యోగం.

మనస్సు అదోకలాగ అయి పోయింది శారదాంబకి.

కథ అనేది వ్రాయడానికి యెక్కడవుంది? మానవుని బ్రతుకే ఒక కథ.

శ్రీను పిల్లి పిల్లిను చంకబెట్టుకుని శంకరంతో ఆడు కుందుకు వెళ్ళి పోయాడు.

కథ వ్రాయడానికి శారదాంబకు మనస్కరించలేదు, వచ్చిన ఆలోచనలు పటాపంచ లయ్యాయి "ఆదర్శకుటుం బం" అని మాత్రం వ్రాసి బల్లమీద పెట్టి ఆ అక్షరాల కేసి చూస్తోంది.

—